క్లుప్తంగా

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం

దౌల్తాబాద్‌: మండల కేంద్రంలోని బలభీమ సేన దేవాలయం వద్ద బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం ఘనంగా జరిగింది. ఇందుకు గాను మూడు రోజులుగా పురోహితులతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమం నిర్వహించారు. చివరి రోజున గ్రామస్తులు నాభిశిలానికి జలాభిషేకం చేశారు. అలాగే ధాన్యరాశులు చల్లి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమానికి సర్పంచ్‌ శిరీష, నాయకులు నరోత్తంరెడ్డి, వీరన్న, వెంకట్రావు, వెంకటప్ప, సాయప్ప, లక్ష్మప్ప తదితరులు పాల్గొని పూజలు చేశారు.

ఎమ్మెల్సీ విజయం బీజేపీ గెలుపునకు నాంది

దౌల్తాబాద్‌: హైదరాబాద్‌, ఉమ్మడి మహబూబ్‌నగర్‌, రంగారెడ్డి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థి ఏవీఎన్‌ రెడ్డి గెలుపు రానున్న సాధారణ ఎన్నికల్లో పార్టీ విజయానికి నాంది కానుందని ఆ పార్టీ రాష్ట్ర కిసాన్‌మోర్చా అధికార ప్రతినిధి కూర వెంకటయ్య, తాలూక కన్వీనర్‌ నర్సింహులు చెప్పారు. ఎమ్మెల్సీగా ఏవీఎన్‌రెడ్డి గెలుపొందిన సందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మంత్రులు, ఎమ్మెల్యేలు పాలన గాలికొదిలేసి ఢిల్లీ లిక్కర్‌ స్కామ్‌లో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీ కవితను కాపాడేందుకు దేశ రాజధానికి చక్కర్లు కొడుతున్నారని ఆరోపించారు.

పన్నులు చెల్లించి.. అభివృద్ధికి సహకరించండి

మున్సిపల్‌ కమిషనర్‌ ప్రవీణ్‌కుమార్‌



అవగాహన కల్పిస్తున్న మున్సిపల్‌ కమిషనర్‌

కొడంగల్‌ రూరల్‌: మున్సిపాలిటీ ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్‌ కమిషనర్‌ టి.ప్రవీణ్‌కుమార్‌ అన్నారు. శనివారం పాతకొడంగల్‌ గ్రామంలో ఇంటి పన్ను, నల్లా బిల్లుల చెల్లింపుపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం సిబ్బందితో పాటు బకాయి ఉన్న ఇంటి యజమానుల వద్దకు వెళ్లి.. సమయానుకూలంగా బకాయి చెల్లించాలని, లేనిపక్షంలో జరిమానా తప్పదన్నారు. ఈ సందర్భంగా పలువురి నుంచి బిల్లులు వసూలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్‌ సిబ్బంది పాల్గొన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

మెప్మా డీఎంసీ రవికుమార్‌



లబ్ధిదారులను ఎంపిక చేస్తున్న అధికారులు

కొడంగల్‌ రూరల్‌: మైనార్టీ కమ్యూనిటీస్‌(ముస్లిం)లకు జిల్లా మైనార్టీ వెల్ఫేర్‌ ఆధ్వర్యంలో అందించే రుణాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని మెప్మా డీఎంసీ జి.రవికుమార్‌, మున్సిపల్‌ కమిషనర్‌ టి.ప్రవీణ్‌కుమార్‌ చెప్పారు. శనివారం పట్టణంలోని మున్సిపల్‌ కార్యాలయంలో కేటగిరి–1,2 ప్రకారం మైనార్టీ వెల్ఫేర్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారిలో 8మంది లబ్ధిదారులను డిప్‌ సిస్టం ద్వారా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపికైన లబ్ధిదారులు రుణాలను సద్వినియోగం చేసుకుంటూ.. తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ సిబ్బంది, మెప్మా సిబ్బంది, ముస్లిం దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ

కుల్కచర్ల: మొక్కల పెంపకం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కలకు పాదులు తీయడం, నూతన మొక్కల ఏర్పాటుకు గుంతలు తీయించి మాట్లాడారు. మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం చేయరాదని, వాటి పెరుగుదలకు శ్రద్ధ చూపాలని చెప్పారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, ఉపాధిహామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రామలింగేశ్వరుడి కల్యాణం



కల్యాణం జరుపుతున్న వేదపండితులు

పూడూరు: దామగుండం రామలింగేశ్వర స్వామి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం రుద్రాభిషేకం, సహస్ర పుష్పాలంకరణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



అనంతగిరి: పీరంపల్లిలో నేలకొరిగిన మొక్కజొన్న పంట



మోమిన్‌పేట: కురుస్తున్న వర్షం

వడగండ్లు మిగిల్చిన కడగండ్లు

అకాల వర్షాలు అన్నదాతలను అతలాకుతలం చేస్తున్నాయి. జిల్లాలో మూడు రోజులుగా పలుచోట్ల ఈదురుగాలులకు వడగండ్లు తోడై కురుస్తున్న భారీ వర్షాలకు పంట పొలాలు దెబ్బతినగా.. మామిడితోటలు, ఉల్లిసాగు పూర్తిగా నేలమట్టం అయింది. పలు చోట్ల కరెంట్‌ స్తంభాలు నేలకొరిగి.. విద్యుత్తుకు అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రజలు రాత్రంతా చీకట్లోనే గడిపారు.

ఈదురుగాలులతో భారీవర్షం
- దెబ్బతిన్న పంటపొలాలు
- నేలరాలిన మామిడి, చింత
- నేలకొరిగిన విద్యుత్‌ స్తంభాలు
- ఆదుకోవాలంటున్న రైతులు

అనంతగిరి: వికారాబాద్‌ మండలంలో శుక్రవారం అర్ధరాత్రి భారీవర్షం కురిసింది. ఒక్కసారిగా వడగళ్లు, ఈదురు గాలులతో కూడిన వర్షం పడడంతో ప్రధాన రోడ్లన్నీ జలమయమయ్యాయి. జొన్న, మొక్కజొన్న పంట నేలకొరగగా.. మామిడి, చింత కాయలు రాలిపోయాయి. చామంతి, లిల్లీ తదితర పూల పంట పూర్తిగా నేలమట్టమయింది. టమాటాతో పాటు కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. మదన్‌పల్లిలో మామిడి చెట్లు నేలకొరిగాయి. పాతూర్‌ వద్ద ప్రధాన రోడ్డుపై సోలార్‌ విద్యుత్‌ 9 పోల్స్‌ ఒరిగిపోగా.. సిద్దులూర్లో 6, మదన్‌పల్లిలో 4 విద్యుత్‌ స్తంభాలు నెలకొరిగాయి. పీరంపల్లిలో వ్యవసాయ పొలంలోని కొట్టంలో దుడ్డె మృత్యువాత పడింది. చేతికి వచ్చిన పంటలు కోల్పోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం వెంటనే పరిహారం అందించాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా శనివారం సాయంత్రం మరలా వడగండ్ల వర్షం పడింది.



మదన్‌పల్లిలో విరిగిపోయిన మామిడిచెట్లు

వానతో దెబ్బతిన్న వ్యాపారం

ధారూరు: మండల కేంద్రంలో శనివారం సాయంత్రం కొద్దిసేపు వడగళ్ల వాన పడడంతో కూరగాయల మార్కెట్‌, వ్యవసాయ మార్కెట్లో రైతులు, వ్యాపారులు, కొనుగోలుదారులు తడిసి ముద్దయ్యారు. రెండు నిమిషాల పాటు వడగళ్ల వాన పడగా.. ఆపై గంటపాటు భారీవర్షం కురిసింది. దీంతో తమ వ్యాపారం దెబ్బతిందని కూరగాయల రైతులు వాపోయారు.

రాత్రంతా చీకట్లో..

భారీ వర్షానికి శుక్రవారం రాత్రి 8 గంటల నుంచి విద్యుత్‌ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు రాత్రంతా జాగారం చేశారు. ట్రాన్స్‌కో అధికారులకు ఫోన్‌ చేస్తే.. పైనుంచే కరెంట్‌ పోయింది, మేమేం చేస్తామని చెప్పడంతో.. చేసేది లేక చీకట్లో గడపాల్సి వచ్చిందని స్థానికులు వాపోయారు.

మధ్యాహ్నం ఉక్కపోత..

యాలాల: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షంతో పాటు వడగళ్లు పడ్డాయి. దీంతో మధ్యాహ్నం వరకు ఉక్కపోతగా ఉన్న వాతావరణం.. ఒక్కసారిగా చల్లబడింది. కమాల్‌పూర్‌, నాగసముందర్‌, విశ్వనాథ్‌పూర్‌, రాస్నం తదితర గ్రామాల్లో భారీ సైజు గోళీల ఆకారంలో వడగళ్లు పడ్డాయి. దీంతో రైతులు ఆందోళన చెందారు.

మూడురోజులుగా..

మోమిన్‌పేట: మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు, సాయంత్రం 5గంటలకు ఇలా దఫాలుగా వడగళ్ల వాన పడింది. మూడు రోజులుగా కురుస్తున్న వడగండ్లతో రైతులు అల్లాడుతున్నారు. గురువారం భారీ వడగండ్లకు కొన్ని గ్రామాల రైతులు నష్టపోగా.. శనివారం ధాటికి మరింత మందిపై ప్రభావం పడింది.

దెబ్బతిన్న ఉల్లి..

తాండూరు రూరల్‌: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. ఐనెల్లి, కోత్లాపూర్‌, సంకిరెడ్డిపల్లి, సిరిగిరిపేట్‌, రాంపూర్‌, జినుగుర్తిలో ఉల్లిపంటకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. ఇప్పటికే రైతులు ఉల్లిబస్తాలు పొలాల్లోనే ఉంచారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు వర్షం పడింది. దీంతో ఇప్పటికే ఉల్లికి ధర తక్కువగా ఉందని, ఈ వర్షానికి మళ్లీ పంట పాడైనట్లు రైతులు ఆవేదన చెందుతున్నారు.

మర్పల్లిలో..

మర్పల్లి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం వడగండ్ల వాన కురిసింది. గురువారం మండల పరిధిలోని 5 గ్రామాల్లో వర్షం పడగా.. మరోసారి శనివారం విరుచుకు పడడంతో రైతులు ఆందోళన చెందారు.

రైతులకు తీరని నష్టం

కుల్కచర్ల: వడగళ్లతో రైతులు, ఇటుక బట్టీల నిర్వాహకులు తీవ్రంగా నష్టపోయారు. శుక్రవారం రాత్రి కుల్కచర్ల మండల పరిధిలోని పలు గ్రామాల్లో వడగళ్ల వాన పడడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

విరిగిన కరెంటు స్తంభాలు

బంట్వారం: ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పడడంతో కోట్‌పల్లి మండలంలోని రాంపూర్‌, కంకణాలపల్లి, ఎన్కెపల్లి, మోత్కుపల్లిలో 11 విద్యుత్‌ స్తంభాలు విరిగిపోయాయి. రాంపూర్‌లో రేకుల షెడ్డు గాలిలో ఎగిరి పడింది. అయినప్పటికీ ఎక్కడా ఎలాంటి ప్రమాదం జరగలేదు.



అనంతగిరి: పాతూర్‌ గేట్‌ వద్ద ఒరిగిన విద్యుత్‌ స్తంభాలు



యాలాల: కమాల్‌పూర్‌లో ఓ ఇంట్లో పడిన వడగళ్లను పరిశీలిస్తున్న వ్యక్తి



తాండూరు రూరల్‌: ఐనెల్లిలో ఉల్లిపంటను చూపుతున్న రైతు



నేలరాలిన మామిడి

21న సర్వసభ్య సమావేశం

పూడూరు: ఈ నెల 21న ఎంపీపీ మల్లేశం అధ్యక్షతన పూడూరు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ ఉమ తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు ఎంపీడీఓ సమావేశ మందిరంలో సమీక్ష ఉంటుందని, సభ్యులు సకాలంలో పాల్గొనాలని చెప్పారు. సంబంధిత శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

దోమ: ఆలయాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని కేఎస్‌ఆర్‌ ట్రస్ట్‌ చైర్మన్‌ శరత్‌ కుమార్‌ రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని మైలారంలో పోచమ్మ ఆలయ నిర్మాణానికి రూ.30 వేల విరాళం అందజేసి మాట్లాడారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండేందుకు దేవాలయాలు ఎంతో ఉపయోగపడతాయని, ప్రతి ఒక్కరూ దైవభక్తిని పెంపొందించుకోవాలని చెప్పారు.

‘ఇళ్ల స్థలాలు ఇవ్వకుంటే గుడిసెలు వేస్తాం’

పరిగి: ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించకుంటే గుడిసెలు వేస్తామని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్‌రాములు హెచ్చరించారు. శనివారం పట్టణ కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని పేదలైన అర్హులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. సర్కారు భూములు ఆక్రమణకు గురవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కబ్జాలకు గురైన భూములను స్వాధీనం చేసుకుని, అర్హులైన వారికి ఒక్కొక్కరికి 120 గజాల ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. లేదంటే ఆ భూముల్లో గుడిసెలు వేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాలు పద్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, హబీబ్‌, సత్తయ్య, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

జీతాల చెల్లింపులో జాప్యం తగదు

కొడంగల్‌ రూరల్‌: పట్టణంలోని ఎస్టీఓ కార్యాలయంలో సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, జీతాల చెల్లింపులో జాప్యాన్ని నివారించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని టీఎస్‌జీఓస్‌ కొడంగల్‌ యూనిట్‌ అధ్యక్షుడు కొండన్న శనివారం ఒక ప్రకటనలో డిమాండ్‌ చేశారు. కార్యాలయానికి సిబ్బంది పూర్తిస్థాయిలో హాజరుకావడం లేదని, ఏదైనా విషయాన్ని అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతారని ఆరోపించారు. ఫోన్‌ ద్వారా సంప్రదించాలని యత్నించినా స్పందించడం లేదని పేర్కొన్నారు. అధికారులు స్పందించి జీతాల చెల్లింపులో జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

చట్టాలపై అవగాహన అవసరం

- కేసుల్లో రాజీ పడితే ఇరువురూ గెలిచినట్లే
- జూనియర్‌ సివిల్‌ కోర్టు జడ్జి హరికుమార్‌



మాట్లాడుతున్న జడ్జి హరికుమార్‌

పరిగి: ప్రతి ఒక్కరికీ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని పరిగి జూనియర్‌ సివిల్‌ కోర్టు జడ్జి హరికుమార్‌ అన్నారు. శనివారం చిట్యాలలో జన్‌ సాహస్‌ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో లీగల్‌ సర్వీస్‌ అథారిటీ సహకారంతో నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. చట్టాల గురించి అవగాహన లేకుంటే ఏమీ తెలియదని, దీంతో కొన్ని కేసుల్లో న్యాయస్థానాల చుట్టూ తిరుగుతుంటారని తెలిపారు. అసలు ఎందుకు తిరుగుతున్నామో వారికే తెలియని పరిస్థితి కలుగుతుందని చెప్పారు. చట్టాలపై అవగాహన ఉంటే సమయం వృథా కాదని వెల్లడించారు. నిరుపేదలు ఎవరైనా ఉంటే కోర్టు కేసులకు సంబంధించి న్యాయమూర్తికి దరఖాస్తు చేసుకోవాలని, అలా అయితే కోర్టు ద్వారా ఒక న్యాయవాదిని అటాచ్‌ చేస్తామని పేర్కొన్నారు. కోర్టులో పెండింగ్‌ కేసులు ఉన్న వారు ఇరువురు రాజీ పడితే కేసులను కొట్టి వేస్తామని, దీనిద్వారా ఇరువురూ గెలిచినట్లేనన్నారు. బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు నరేందర్‌ యాదవ్‌, ఎంఎల్‌ఎస్‌ఏ కో ఆర్డినేటర్‌ సునిత, జన్‌సాహస్‌ సంస్థ జిల్లా కో ఆర్డినేటర్‌ ప్రకాశ్‌, ఏజీపీ వెంకట్‌రెడ్డి, గ్రామపెద్దలు రాజా పుల్లారెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలంకార ప్రాయంగా వైకుంఠధామాలు

ఆఖరి మజిలీ గౌరవప్రదంగా ఉండాలన్న సర్కారు లక్ష్యం నెరవేరడం లేదు. ఊరూరా నిర్మించిన వైకుంఠధామాలు అధికారుల నిర్లక్ష్యానికి నిరుపయోగంగా మారుతున్నాయి. నీటి సౌకర్యం, విద్యుత్‌ సౌకర్యం తదితర వసతులు లేకపోవడంతో శ్మశాన వాటికలు వినియోగంలోకి రావడం లేదు.

అవగాహన లేక నిరుపయోగంగా..
- విద్యుత్‌, నీటి సౌకర్యాలు కరువు
- సొంత భూముల్లోనే అంత్యక్రియలు
- లేని వారి పరిస్థితి దయనీయం




ఐనాపూర్‌ గ్రామంలో నిరుపయోగంగా ఉన్న వైకుంఠధామం

దోమ: రాష్ట్ర ప్రభుత్వం పల్లె ప్రగతిలో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధిహామీ కింద గ్రామాల్లో వైకుంఠధామాలను నిర్మించింది. నిర్మించి ఏడాది గడుస్తున్నా.. ఆయా గ్రామాల్లో వాటిని వినియోగించుకునేందుకు ప్రజలకు అవగాహన లేక ముందుకు రావడం లేదు. ఇందుకు అధికారుల వ్యవహారశైలే కారణమని తెలుస్తోంది. దోమ మండల వ్యాప్తంగా మొత్తం 36 గ్రామపంచాయతీల్లో జాతీయ ఉపాధి హామీ పథకం కింది ఒక్కొక్క వైకుంఠ ధామాన్ని రూ.12.50 లక్షలతో నిర్మించారు. కొన్ని గ్రామాల్లో బర్నింగ్‌ షెడ్‌, స్నానాల గదులు, ప్రహరీ, మూత్రశాలలు, సీసీరోడ్లు, విద్యుత్‌, నీటి సౌకర్యాలు పూర్తయినప్పటికీ.. మరిన్ని గ్రామాల్లో నిర్మాణ దారులకు బిల్లులు రాకపోవడంతో పెండింగ్‌లో ఉంచారు. ఊటుపల్లి, లింగన్‌పల్లి, బుద్లాపూర్‌, బొంపల్లి, ఐనాపూర్‌, శివారెడ్డిపల్లి, గొడుగోనిపల్లి, మోత్కుర్‌తో తదితర గ్రామాల్లో నేటికీ విద్యుత్‌ కనెక్షన్లు, డోర్లు, నీటి సౌకర్యాలను కల్పించలేదు. దీంతో వాటిని వినియోగించుకోవడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఎవరైనా కాలంచేస్తే.. అంత్యక్రియలకు సొంత భూములే దిక్కవుతుండగా.. భూమి లేని వారి పరిస్థితి దయనీయంగా మారింది.

అవగాహన లేక..

వైకుంఠధామాలపై ప్రజలకు సరైన అవగాహన లేకపోవడంతోనే నిరుపయోగంగా మారుతున్నాయి. లక్షలు వెచ్చించి నిర్మిస్తే.. ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. దీనికి తోడు వాటిని గ్రామానికి దూరంగా నిర్మించడంతో వాటిని వినియోగించుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపడం లేదు. సరైన మౌలిక వసతులు కల్పించి వినియోగంలోకి తెచ్చేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.


వినియోగంలోకి తేవాలి



గ్రామాల్లో ప్రజలకు సరైన అవగాహన లేకపోవడంతోనే వైకుంఠధామాలు నిరుపయోగంగా మారుతున్నాయి. దీంతో సొంత పొలాల్లోనే అంత్యక్రియలు జరుపుకొంటున్నారు. పొలాలు లేని వారి పరిస్థితి దయనీయంగా మారింది. సంబంధిత అధికారులు వెంటనే శ్మశాన వాటికల్లో నీటి వసతి, విద్యుత్‌ సౌకర్యాలు కల్పించి వినియోగంలోకి తేవాలి.

– నర్సప్ప, బుద్లాపూర్‌ గ్రామం

సౌకర్యాలు కల్పిస్తాం



నిరుపయోగంగా ఉన్న వైకుంఠధామాల్లో వసతులు కల్పించి, వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే కొన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేసిన శ్మశాన వాటికల్లో అంత్యక్రియలు జరిగాయి. మిగతా గ్రామాల్లో విద్యుత్‌, నీటి సౌకర్యాలు ఏర్పాటు చేస్తాం. ప్రజలకు గ్రామ సభల ద్వారా మరింత అవగాహన కల్పిస్తాం. వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటాం.

– జయరాం, ఎంపీడీఓ, దోమ

రుణాలు సక్రమంగా చెల్లించాలి



సంధ్య శిబిరంలో మాట్లాడుతున్న బ్యాంకు అధికారులు

పరిగి: బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించాలని పరిగి ఎస్‌బీఐ ఆర్‌సీఎం రాధాకృష్ణ సూచించారు. శనివారం మండల పరిధిలోని రూప్‌ఖాన్‌పేట్‌ గ్రామంలో సంధ్య శిబిరంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు పంట రుణాలు తీసుకొని, రెనివల్‌ చేయకుండా మరిచిపోతున్నారని తెలిపారు. కావున సంవత్సరం పూర్తైన వెంటనే రెనివల్‌ చేసుకోవాలని, లేదంటే మిత్తి ఎక్కువగా పడుతుందని చెప్పారు. వ్యవసాయ రుణాలు, ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీ రుణాలను తీసుకున్న వారు క్రమం తప్పకుండా చెల్లిస్తే.. మళ్లీ రుణాలు పొందే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ఖాతాదారులు, మహిళా సంఘాల సభ్యులు తప్పకుండా బ్యాంకు లింకేజీలను చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ నరసింహ, చీఫ్‌ మేనేజర్‌ అనుప్రభ, ఫీల్డ్‌ ఆఫీసర్‌ కలీమొద్దీన్‌ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం

దౌల్తాబాద్‌: గోకఫసల్‌వాద్‌ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఘనంగా స్వయంపాలన దినోత్సవం జరుపుకొన్నారు. కలెక్టర్‌గా మనీష, డీఈఓగా శ్రీలత, ఎంఈఓగా శ్రీలత, హెచ్‌ఎంగా అశ్విత, పీఈటీగా అన్సస్‌ఖాన్‌లతో పాటు మరికొంతమంది ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయ్‌కుమార్‌, ఉపాధ్యాయులు మల్లికార్జున్‌, సాయిలుగౌడ్‌, వీరన్న, శానమ్మ, రేణుక, రజియా తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో విద్యార్థులు

ఈ ఆస్పత్రికి గేటేది?

తాండూరు రూరల్‌: ఈ చిత్రంలో కనిపిస్తున్న భవనం.. తాండూరు మండలం జినుగుర్తి గ్రామంలోని పీహెచ్‌సీ(ప్రాథమిక ఆరోగ్య కేంద్రం). జినుగుర్తి పీహెచ్‌సీ కింద 9 క్లస్టర్లు.. 33 గ్రామాలు ఉన్నాయి. నిత్యం వివిధ గ్రామాల నుంచి రోగులు ఆస్పత్రికి వస్తుంటారు. ఈ ఆస్పత్రికి ప్రధాన గేటులేదు. గేటు మరమ్మతుకు గురికావడంతో దాన్ని పక్కన పడేశారు. దీంతో పీహెచ్‌సీకి ప్రహరీ లేకపోవడంతో పందులు, పశువులు, మేకలు ఆస్పత్రి ఆవరణలోకి వస్తున్నాయి. పీహెచ్‌సీకి ప్రధాన గేటు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



గేటు లేని జినుగుర్తి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం